మంగళవారం ; తెలంగాణ
28 జూలై 2026
నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం

## ములకలపల్లి మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా రవి పునర్నియామకం

అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే జారే



**ములకలపల్లి, జూలై 27 (నినాదం):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గం ములకలపల్లి మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా పాలకుర్తి రవి రెండోసారినియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో రెండోసారి ఈ బాధ్యతలను అప్పగించినందుకు మానుకొండూరు ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్సీ విభాగం అధ్యక్షులు కవ్వంపల్లి సత్యనారాయణకు, అశ్వారావుపేట శాసనసభ్యులు జారె ఆదినారాయణకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే తన నియామకానికి సహకరించిన ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ గద్దల రమేష్‌తో పాటు ములకలపల్లి మండల కాంగ్రెస్ పార్టీ కమిటీ నాయకులకు, కార్యకర్తలకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి, ఎస్సీ వర్గాల సంక్షేమానికి శాయశక్తులా కృషి చేస్తానని ఈ సందర్భంగా రవి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండి జహీర్ కాంగ్రెస్ పార్టీ ములకలపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ కొరసా చంద్రలేఖ కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బత్తుల అంజి, పేటేటి నరసింహ రావు, తిరుపతి రెడ్డికాంగ్రెస్ పార్టీ నాయకులు అంజుమ్, అశ్వారావుపేట నియోజకవర్గ యూత్ ప్రెసిడెంట్ పాలకుర్తి సుమిత్ కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు శనగపాటి రవి సురభి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన పోతారం మాజీ ఎంపిటిసి గంగాధర్



**మల్యాల ,జులై 27( నినాదం):** మండలంలోని పోతారం మాజీ ఎంపిటిసి కొల్లూరి గంగాధర్ తన అనుచరులు 300 మంది కార్యకర్తలతో సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. గంగాధర లోని ప్రజా కార్యాలయంలో స్థానిక చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి ,సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితుడై పార్టీలో చేరడం జరిగిందని మల్యాల మండలంలో పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్, సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు మిట్రీ శ్రీను, మల్యాల ఉపసర్పంచ్ కటకం వినయ్, మానాల సర్పంచ్ పాపారావు, సర్వాపూర్ సర్పంచ్ జంగిలి హనుమంతు, నక్క అనిల్ ,శనిగారపు తిరుపతి, నేరెళ్ల సతీష్ రెడ్డి, మ్యాక లక్ష్మణ్, బద్దం తిరుపతిరెడ్డి, అంజిరెడ్డి, కంటే అరుణ్, బండి రవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య ప్రాప్తికి రుద్రాభిషేకం - మృత్యుంజయ హోమం



**నల్లబెల్లి,జూలై 27 (నినాదం):** నల్లబెల్లి శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్యం త్వరగా మెరుగుపడాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజా కార్యక్రమాలునిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పెండోట మురళీమోహనాచార్యులు ఆధ్వర్యంలో పురోహితులు ఆసం సుదర్శనాచార్యులు, మియ్యాపురంకరుణాకరాచార్యులు, పొనుగోటి రాజేశ్వరాచార్యులు, కిష్టోజు రవీంద్రా చార్యులు, పెండోటసూర్యమోహనాచార్యులు, అనిల్ శాస్త్రి వేద మంత్రోచ్చారణల మధ్య రుద్రాభిషేకంనిర్వహించారు.అనంతరం అపమృత్యు దోష నివారణతో పాటు సంపూర్ణ ఆరోగ్య ప్రాప్తి కలగాలని సంకల్పించి రుద్ర మృత్యుంజయ హోమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ఆలయ ధర్మకర్త తాటిపెల్లి రవీందర్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో సాగింది. ఈ సందర్భంగా పురోహితులుపరమేశ్వరుని అనుగ్రహంతో పెద్ది సుదర్శన్ రెడ్డి సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకుని ప్రజాసేవలో తిరిగి చురుకుగా పాల్గొనాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ సేవకులు, భక్తులు పాల్గొని పూజల్లో పాల్గొన్నారు.

## ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విద్యుత్ ఉద్యోగుల నిరసన




**వైరా, జూలై 27( నినాదం):** రాష్ట్ర పవర్ జేఏసీ పిలుపు మేరకు విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ ఉద్యోగులు చేస్తున్న న్యాయమైన ఆందోళనకు సంపూర్ణ మద్దతు తెలుపుతూ ఎన్పీడీసీఎల్ ఉద్యోగులు సోమవారం నల్ల బ్యాడ్జీలు ధరించి, వైరా డివిజనల్ కార్యాలయము వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యోగులంతా ఏకం కావలసిన సమయం ఆసన్నమైందని అన్నారు. కార్మికులు ,ఉద్యోగులు సంఘాలన్నీ ఏకమైనప్పుడే సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తే ప్రజలపై భారం పడుతుందని సబ్సిడీలు కొనసాగింపు కష్టమౌతుందని, దీనివల్ల దరల పెరుగుతాయని ప్రజలపై భారం పడుతుందని, ఉద్యోగుల మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని, కావున అంతా ఒక తాటి పైకి వచ్చి ఉద్యమించి న్యాయమైన హక్కులను పరిరక్షించుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పవర్ జేఏసీ కార్యవర్గ సభ్యులు, రాజరత్నం, నరసింహారెడ్డి, నాగేశ్వరరావు, ఎం ప్రసాద్. జార్జి,ట్రేడ్ యూనియన్ నాయకులు , వైరా ఎలక్ట్రికల్ ఇంజనీర్ నాగేశ్వరరావు, సురేష్, ఏ ఏ ఓ, అధికారులు రాజా సిన్హా,వర్మ, మంజుల శ్రీజ, ,వీరభద్ర రావు, పాషా, కృష్ణ ప్రసాద్, వివేక్,ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

ఫోటో: వైరా విద్యుత్ డి ఈ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఎన్పీడీసీఎల్ ఉద్యోగులు.

## పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న
# అశ్వరావుపేట శాసనసభ్యులు జారే

- చాపరాలపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం
- పాఠశాలల ప్రహరీ గోడలకు శంకుస్థాపన
- సీఎమ్ఆర్ఎఫ్ చెక్కులు, మినుములు, కందుల పంపిణ
- బాధితుల పరామర్శ





**ములకలపల్లి, జూలై 27 (నినాదం):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గంములకలపల్లి మండల పరిధిలోని పలు గ్రామ పంచాయతీల్లో అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ విస్తృతంగా పర్యటించి, వివిధ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.? చాపరాలపల్లి గ్రామ పంచాయతీలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను ఎమ్మెల్యే సోమవారం ఘనంగా ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. అనంతరం అదే గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ప్రహరీ గోడ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.? ఈ క్రమంలోనే గుట్టగూడెం గ్రామ పంచాయతీలో పర్యటించిన ఎమ్మెల్యే, అక్కడి పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి పూజలు నిర్వహించి భూమిపూజ చేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు రక్షణ, మెరుగైన వసతులు కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు.

?అనంతరం ములకలపల్లి రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎమ్ఆర్ఎఫ్) ద్వారా మంజూరైన సహాయక చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఇదే వేదికపై మండలంలోని రైతులకు సబ్సిడీపై మినుములు , కందుల విత్తనాలను పంపిణీ చేశారు. రైతులు ఆధునిక పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని కోరారు. ?అనారోగ్య బాధితులకు పరామర్శ పర్యటనలో భాగంగా అనారోగ్యంతో బాధపడుతూ కోలుకున్న తన్నీరు పుష్పవతి, నల్లమౌతు నీలమ్మ, బానోతు యేసులను ఎమ్మెల్యే ఆత్మీయంగా పరామర్శించారు. వారి ఇళ్లకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిని, అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. బాధితులను అధైర్యపడవద్దని, ప్రభుత్వం తరఫున తగిన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.? ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఆగస్టు 1న హైదరాబాద్‌లో TPUS రాష్ట్ర మహాధర్నా

పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఉపాధ్యాయులకు పిలుపు

**దుబ్బాక, జూలై 27(నినాదం):** తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ యూనియన్ (T-PUS) రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఆగస్టు 1న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి మహాధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం లచ్చాపేట జామీ పాఠశాలలో ఉపాధ్యాయ శిక్షణా కార్యక్రమం విరామ సమయంలో మహాధర్నా పోస్టర్‌ను గౌరవ మండల విద్యాధికారి సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శాఖా మండల అధ్యక్షులు ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలోని ఉపాధ్యాయులు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న సమస్యలు ఇంకా పరిష్కారం కాకపోవడం ఆందోళనకరమని అన్నారు. ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ల పట్ల ప్రభుత్వం వెంటనే సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయడం, నూతన పీఆర్సీ (PRC) అమలు చేయడం, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడం, పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు, బదిలీలు చేపట్టడం, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడం, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం వంటి ప్రధాన డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర స్థాయి మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణకు, విద్యారంగ అభివృద్ధికి అందరూ ఐక్యంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని ఆయన



పేర్కొన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు ఆగస్టు 1న హైదరాబాద్‌లో జరిగే మహాధర్నాలో కుటుంబ సభ్యులతో సహా పాల్గొని సంఘీభావం ప్రకటించాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఐక్యతే ప్రధాన బలమని, రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా ఉపాధ్యాయులు తరలివచ్చి మహాధర్నాను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వీరభత్తిని రవి, కుమార్, యాదయ్య, వెంకటేశం, సురేష్, బద్రీనాథ్, లావణ్య, భాగ్యమ్మ, రేణుక తదితర ఉపాధ్యాయులు పాల్గొని మహాధర్నా విజయవంతానికి కృషి చేయాలని సంకల్పం వ్యక్తం చేశారు.

## వరి సాగు తగ్గించి ఆరు తడి పంటలు సాగు చేయండి: ఎమ్మెల్యే జారే

ములకలపల్లిలో విత్తన మేళా ప్రారంభం





**ములకలపల్లి, జూలై 27( నినాదం):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట నియోజకవర్గం ములకలపల్లి లో ఎల్‌నినో ప్రభావంతో లోటు వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో వరిసాగు తగ్గించి, ప్రత్యామ్నాయ ఆరుతడి పంటలు సాగు చేయాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ రైతులకు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మూడు రోజుల పాటు (27 నుండి 29 వరకు) జరిగే విత్తన మేళాను ఆయన ప్రారంభించారు.
?ఈ సందర్భంగా భూగర్భ జలాలు తగ్గుతున్నందున రైతులు తక్కువ నీటితో పండే కంది, పెసర, మినుము, మొక్కజొన్న లాంటి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని కోరుతూ... లబ్ధిదారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు జహీర్, సర్పంచ్ కోర్స చంద్రలేఖ, ఏఓ అరుణ్ బాబు, వ్యవసాయ అధికారులు, డీలర్లు ,రైతులు పాల్గొన్నారు.

**ఘనంగా రైతు నేస్తం 100వ ఎపిసోడ్**

ములకలపల్లి, పూసగూడెం, జగన్నాథపురం రైతు వేదికలలో ప్రతి మంగళవారం నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమం 100వ ఎపిసోడ్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం 9:00 గంటల నుండి రైతు వేదికలలో వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు

## అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో చేరేలా కృషి

కాంగ్రెస్ పార్టీ వినాయక్ నగర్ డివిజన్ అధ్యక్షులు పిట్ల నాగరాజు





**మల్కాజిగిరి, జూలై 27 (నినాదం):** మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సూచనల మేరకు ఎస్ ఐ ఆర్ ఫామ్స్ నింపుతూ, అర్హులైన ప్రతి ఓటర్ పేరు ఓటరు జాబితాలో ఉండేలా కృషి చేస్తున్నామని కాంగ్రెస్ పార్టీ వినాయక్ నగర్ డివిజన్ అధ్యక్షులు పిట్ల నాగరాజు అన్నారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ వినాయక్ నగర్ డివిజన్ అధ్యక్షులు పిట్ల నాగరాజు బిఎల్ఓ లతో ఎన్యుమరేషన్ ప్రక్రియను పరిశీలిస్తూ, సర్ పై ప్రజలకు వివరిస్తూ ఎన్యూమరేషన్ ఫారాలను నింపుతూ వారికి అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ఇప్పటివరకు ఎన్యుమరేషన్ ఫారాలను అందుకోని అర్హులైన ఓటర్లు అవసరమైతే తమ ఓటరు గుర్తింపు కార్డు నంబర్ పంపించినా ఫారం అందించేందుకు సహకరిస్తామని, అలాగే అందుకున్న ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తి చేసి వీలైనంత త్వరగా తిరిగి తమ బూత్ లలో ఉన్న బిఎల్ఓ లకు అందజేయడం ద్వారా రానున్న డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో పేరు నమోదు అయ్యే అవకాశం ఉంటుందని, అర్హులైన ప్రతి ఓటరు ఈ ప్రక్రియలో భాగస్వాములై తమ ఓటు మిస్ కాకుండా ప్రతిఒక్కరూ ఓటు హక్కును కాపాడుకోవాలని సూచించారు.

## చెత్తతో కూరుకుపోయిన కాల్వలు.. వ్యాధుల భయంతో కాటారం ప్రజలు

**కాటారం, జూలై 27( నినాదం):** ఇటీవల కురిసిన వర్షాలతో కాటారం గ్రామ పంచాయతీపరిధిలో పారిశుద్ధ్య సమస్యలు తీవ్రరూపం దాల్చాయి. మురుగు కాల్వలుచెత్తాచెదారంతో కూరుకుపోవడంతో నీటి ప్రవాహం నిలిచిపోయి, మురుగు నీరు వీధులు, రహదారులపైకి చేరుతోంది. పలు ప్రాంతాల్లో నిల్వ నీరు పేరుకుపోవడంతో దోమల వ్యాప్తి అధికమై, డెంగీ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో బ్లీచింగ్ చల్లడం మినహా ఫాగింగ్, కాల్వల శుభ్రపరిచే పనులు, దోమల నివారణ చర్యలు ఆశించిన స్థాయిలో జరగడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సాయంత్రం వేళల్లో దోమల బెడద ఎక్కువై చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
మరోవైపు కొన్ని ప్రాంతాల్లో వీధి దీపాలుపనిచేయకపోవడంతో రాత్రి వేళల్లో ప్రజలు అవస్థలు ఎదుర్కొం టున్నారు. పరిస్థితి మరింత విషమించకముందే ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమా లు చేపట్టి మురుగు కాల్వలను పూర్తిగా శుభ్రం చేయాలని, నిల్వ నీటిని తొల గించి ఫాగింగ్ నిర్వహించాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## నీట్ పేపర్ లీకేజీ విద్యార్థి ఉద్యమ అమరవీరులకు కొవ్వొత్తులతో నివాళి

విద్యార్థి శక్తి ముందు కేంద్ర ప్రభుత్వం తలవంచింది
-ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్



**కొత్తగూడెం, జూలై 27:(నినాదం):** ఢిల్లీలో నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీకి వ్యతిరేకంగా జరిగిన విద్యార్థి ఉద్యమంలో అమరులైన 21 మంది విద్యార్థులకు భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ నాయకత్వంలో కొత్తగూడెం అంబేద్కర్ సెంటర్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ మాట్లాడుతూ, విద్యార్థుల సంఘటిత పోరాటం చారిత్రాత్మక విజయాన్ని సాధించిందని అన్నారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా దేశ విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని విమర్శించారు. 37 రోజుల పాటు సాగిన విద్యార్థుల ఉద్యమం ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని పేర్కొన్నారు. అమరులైన విద్యార్థుల కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి ఒక ప్రభుత్వ ఉద్యోగం, రూ. 1 కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే నీట్ పేపర్ లీకేజీకి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుని, పారదర్శక దర్యాప్తు నిర్వహించాలని కోరారు. స్వామి వివేకానంద, మహాకవి శ్రీశ్రీ సందేశాలను యువత ఆదర్శంగా తీసుకుని సమసమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి అల్లి శంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండా రమేష్, పి. సురేందర్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి భూపతి అశోక్, జిల్లా నాయకులు మచ్చ పృథ్వీరాజ్, రాజేశ్వరరావు, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్క ఓటు అత్యంత కీలకమే సత్తుపల్లి ఎమ్మెల్యే

ఎస్ ఆర్ పట్ల అవగాహన సదస్సు నిర్వహించిన ఎమ్మెల్యే



**తల్లాడ, జులై 27(నినాదం ):** తల్లాడరైతువేదికలో జరిగిన ఎస్ ఆర్ ఓటు అవగాహన సధస్సు లో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ కార్యకర్తలకి దిశ నిర్దేశం చేశారు. గ్రామాల్లో ప్రతి బూత్ లో ఓట్లు అన్ని వచ్చాయా రాలేదో చూసుకోవాలని, చనిపోయిన ఓట్లు తీపించడం,కొత్త ఓటర్లను జాబితాలో చేర్పించడం, ఇక్కడ లేని ఓట్లను రిజక్ట్ చేయడం, వంటివి బి ఏల్ ఓ లను సమన్వయం చేసుకుంటూ ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలి సమయం తక్కువగా ఉన్నందున ఓట్ల విషయం లో అప్రమత్తం గా ఉండాలని ప్రతి ఒక్క ఓటు అత్యంత కీలకం అని కార్యకర్తలకు దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమం లో బి ఎల్ ఓ సత్తుపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ రాయల రాము, కాంగ్రెస్ మండల అధ్యక్షులు గొడుగునూరి. లక్ష్మరెడ్డి,సర్పంచ్ లు కటికి కిరణ్ కుమార్, గుర్రం. శ్రీనివాసరావు,కాంగ్రెస్ మండల నాయకులు జక్కంపూడి కిషోర్,ఎర్రి నరసింహ రావు,బొడ్డు. వెంకటేశ్వర రావు,తుమ్మల పల్లి రమేష్,శరత్ బాబు,గొడుగునూరి. శ్రీనివాస రెడ్డి,గణేషుల రవి, సామినేని రామ అప్పా రావు,తది తరులు పాల్గొన్నారు.



## రెయిన్బో స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ ఖాజా ఆత్మహత్య



**చింతపల్లి, జూలై 27(నినాదం ):** మం డలంలోని మాల్ (వీటీ నగర్)లోని రెయిన్బో స్కూల్‌లో సోమవారం విషా దం చోటుచేసుకుంది. పాఠశాల మేనే జింగ్ డైరెక్టర్ గరీబ్ ఖాజా నవాబ్అదే పాఠశాల ఆవరణలోని ఒక గది లో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ముత్యాల రా మ్మూర్తి తెలిపారు. ఆర్థిక ఇబ్బం దుల తోనే ఉరి వేసు కొని ఆత్మ హత్య చేసు కున్నట్లు ఆయన తెలిపారు. మృతుడి భార్య షబానా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఆయన తెలిపారు.

మంగళవారం, తెలంగాణ
28 జులై 2026

# నినాదం

తెలంగాణ ప్రాంతీయం

నిఖార్సైన జర్నలిజం

## ఇంట్లో డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి యువకుడు అదృశ్యం

### పీఎస్‌లో ఫిర్యాదు చేసిన తండ్రి



**జవహర్ నగర్, జులై 27 (నినాదం):** ఇంట్లో డ్యూటీకి వెళుతున్నాను అని చెప్పిన యువకుడు అదృశ్యమైన సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్హెచ్ఓ సైదులు తెలిపిన కథనం ప్రకారం... మల్కాజిగిరి కి చెందిన ముఖిత్ (20) గత మూడు సంవత్సరాలుగా దమ్మాయిగూడ లోని 3ఎ వీల్స్ షాపులో పనిచేస్తున్నాడు. ముఖిత్ ఈనెల 24వ తేదీన తన సొంత ఇల్లు అయిన మల్కాజ్గిరి పరిధిలోని ఆనంద నగర్ కు వెళ్లి మరల తిరిగి ఈనెల 25వ తేదీన ఉదయం 9 గంటలకు దమ్మాయిగూడ లోని షాపుకు వెళ్తున్నానని చెప్పి దమ్మాయిగూడ కు వచ్చాడు. అయితే అదే రోజున ఉదయం 11 గంటలకు 3ఎ వీల్స్ షాప్ ఓనర్ అమరేందర్ రెడ్డి ముకిత్ తండ్రి జిలానికి ఫోన్ చేసి నీ కుమారుని స్కూటీ షాపు దగ్గర ఉందని డ్యూటీకి రాలేదని ఫోన్ ద్వారా తెలియజేశాడు. ఈ మేరకు వెంటనే జిలాని దమ్మాయిగూడకు వచ్చి తన కొడుకు గురించి చుట్టుపక్కల వెతికినా తెలిసిన వారి వద్ద వెతికినా, ముఖిత్ ఆచూకీ లభించలేదు. ఈ మేరకు తండ్రి జిలాని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## గోవుని జాతీయ జంతువుగా ప్రకటించాలి

### గోరక్ష అభియాన్ నాయకులు సుభాష్ చందర్





**సంగారెడ్డి బ్యూరో , జులై 27 ( నినాదం ):** గోరక్ష అభియాన్ ఆధ్వర్యములో సోమవారం సంగారెడ్డి లో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కు వినతి పత్రం అందజేశారు. స్వామీజీ ల ఆదేశాల అనుసారం ఈ యొక్క కార్యకరమం నిర్వహించిందన్నారు. ఈ కార్యక్రమం స్థానిక హనుమాన్ మందిరం నుండి కలెక్టర్ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించారు. అయితే ఈ ర్యాలీలో గోమాతను తీసుకొని ఊరేగింపుగా కలెక్టర్ కార్యాలయం వరకు వచ్చారు. జిల్లా లోని సంతకాలు సేకరించిన 2 లక్షల సంతకాలను కలెక్టర్ కు పీడీఎఫ్ రూపములో ఇవ్వటం జరిగింది. అంతరం అక్కడ వచ్చిన కార్యకర్తలను ఉద్దేశించి అభియాన్ నాయకులు సుభాష్ చందర్ ,షెరీన్ సింగ్ ,సోహన్ లాల్ దహిమ కాన్సిలర్ జగన్ .దామోదర్ రెడ్డి మాట్లాడుతూ దేశం మొత్తం ఒకే రోజున కలెక్టర్ లకు వినతి పత్రాలు ఇస్తున్నామన్నారు. దేశంలో గోసంతతిని కాపాడాలి గోమాత లేకుంటే దేశమ లేదని వారు నినాదాలు చేస్తూ పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

1. గోవుని జాతీయ జెంతుగా ప్రకటించాలని
2. రాష్ట్రంలో దేశంలో ప్రత్యేకమైన మంత్రిశాఖ ఉండాలని
3. గోశాలకు ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని
4 గో ఆధారిత వ్యవసాయం కోసం రైతులకు సహయ ము అందించాలన్నారు.

తెలంగాణ ప్రభుత్వం గో రక్షణ చట్టం ఉన్న అమలు చేయటం లో నిలక్ష్యం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ద్వారకా రవి ప్రకాష్ జి .రాథోడ్ బద్రి మహారాజ్ ,పరమేష్, సునీల్ సాయి, సంతోష్ గో భక్త కార్యకర్తలు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో మృతి చెందిన బచ్చయ్య కుటుంబానికి ఆర్థిక సాయం



**ఆమనగల్లు, జూలై 27(నినాదం):** అమనగల్లు మండలం శెట్టిపల్లి గ్రామానికి చెందిన శెట్టిపల్లి బచ్చయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించిన గ్రామ సర్పంచ్ తెల్గమల్ల జంగమ్మ వెంకటయ్య, ఉప సర్పంచ్ బాలగోని కృష్ణ ప్రసాద్ తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ఆర్థిక సహాయం అందజేశారు. కుటుంబ పెద్దను కోల్పోవడం తీరని లోటని పేర్కొంటూ, కష్టకాలంలో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ నాయకులు పాల్గొని మృతుడికి నివాళు లర్పించారు.

## ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతి భద్రతలు పరిరక్షించడానికి కృషి చేయాలి

### ఎస్ఎచ్ఓ వెంకటేశ్వర్లు



**ఆమనగల్లు, జూలై 27 (నినాదం):** ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతి భద్రతలు పరిరక్షించడానికి కృషి చేయాలనీ పోలీస్ స్టేషన్ ఎస్ఎచ్ఓ ఎస్. వెంకటేశ్వర్లు అన్నారు. 2020 బ్యాచ్‌కు చెందిన సబ్–ఇన్‌స్పెక్టర్ ఎ. సంతోష్ కుమార్ రెడ్డి సోమవారం ఆమనగల్లు పోలీస్ స్టేషన్‌లో ఎస్హెచ్ఓ వెంకటేశ్వర్లుకు రిపోర్ట్ చేసి విధుల్లో చేరారు. గతంలో చేవెళ్ల, శంకర్పల్లి పోలీస్ స్టేషన్లలో సమర్థవంతంగా సేవలందించిన సంతోష్ కుమార్ రెడ్డికి పోలీస్ స్టేషన్ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. స్నేహపూర్వక పోలీసింగ్‌తో పాటు పెండింగ్ కేసుల సత్వర పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఈ సందర్భంగా సూచించారు. అనంతరం సబ్–ఇన్‌స్పెక్టర్ ఎ. సంతోష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతి భద్రతలు పరిరక్షించడానికి కృషి చేస్తానని, శాంతి భద్రతల పరిరక్షణ ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. అక్రమ వ్యాపారాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, మండలంలో ఎలాంటి ఫిర్యాదులు ఉన్న నేరుగా పోలీసు స్టేషన్ లో సంప్రదించాలన్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి రాజ్యాంగబద్ధమైన బాధ్యత

పర్యావరణ సమస్యలపై విద్యాధికారులు ఉద్యమస్ఫూర్తితో కదలాలి

ప్రతిఫలాల కోసం కాదు, పుడమి పరిరక్షణ కోసం నిస్వార్థ సేవ చేయాలి

విద్యాశాఖ అధికారుల శిక్షణ కార్యక్రమంలో పర్యావరణవేత్త ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి పిలుపు








**ఆమనగల్లు, జూలై 27(నినాదం):** ప్రకృతిని కాపాడటం, పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి భారత పౌరుడి రాజ్యాంగబద్ధమైన ప్రాథమిక విధి అని ప్రముఖ పర్యావరణవేత్త ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి పేర్కొన్నారు. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల విద్యాశాఖ అధికారుల శిక్షణ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన, సమాజంలో పెరుగుతున్న పర్యావరణ, సామాజిక సమస్యలపై ముఖ్యంగా ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా స్పందించాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులు పాఠ్యాంశాల బోధనకే పరిమితం కాకుండా దేశంలో, ప్రపంచంలో చోటుచేసుకుంటున్న పర్యావరణ, సామాజిక పరిణామాలపై నిరంతరం అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. సమాజానికి సరైన దిశానిర్దేశం చేయడం ఉపాధ్యాయుల అసలైన బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఏ ప్రకారం పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి ప్రాథమిక విధి అని గుర్తు చేశారు. ప్రపంచం ప్రస్తుతం గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పులు, జీవ వైవిధ్య క్షీణత వంటి తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటోందని ఈ తరుణంలో విద్యాధికారులు ఉపాధ్యాయులు సమాజంలో ఉద్యమాన్ని పర్యావరణ ఉద్యమాన్ని అద్భుతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సీజీఆర్ వ్యవస్థాపకులు లక్ష్మారెడ్డి,మాజీ ఆర్టిఏ కమిషనర్ దిలీప్ రెడ్డి, ప్రముఖ విద్యావేత్త మాత్రమే ఉపేందర్ రెడ్డి లు మాట్లాడుతూ ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని సమాజంలో వివిధ వర్గాలతో కలిసి పనిచేసినప్పుడే భావితరాలకు హరిత భవిష్యత్తును అందించగలమని అన్నారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ శాస్త్రవేత్తలు సాయి భాస్కర్ రెడ్డి, ఉమామహేశ్వర్ రెడ్డి, వైఈఎల్పి రాష్ట్ర కోఆర్డినేటర్ యానాల వెంకటరెడ్డి, సుస్థిర పుడమి ఎడిటర్ రమేష్ రావు సిజిఆర్ ప్రతినిధులు నవ్య, వైష్ణవి, సాక్షి,రజినీకాంత్,నగేష్,శంకరయ్య,మద్దిలేటి, శివశంకర్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను జాప్యం లేకుండా వెంటనే పరిష్కరించండి

- జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆదేశం



**మేడ్చల్ కలెక్టరేట్ ,జులై 27 ( నినాదం):** ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి అదనపు జిల్లా కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులను అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి తో కలిసి అదనపు కలెక్టరు (106) దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం లేకుండా చూడాలని అదనపు కలెక్టరు అన్నారు. అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# తలకొండపల్లిలో 'సర్' కార్యక్రమాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే నారాయణరెడ్డి





**ఆమనగల్లు, జూలై 27(నినాదం):** తలకొండపల్లి మండల పరిధిలోని ఖానాపూర్ గ్రామంలో 36,37 భుత్‌లలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్ ) కార్యక్రమాన్ని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఎమ్మెల్యే ఓటరు జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదు, ఓటరు వివరాల మార్పులు, దరఖాస్తుల స్వీకరణ తదితర ప్రక్రియలను పరిశీలించి మిగిలిన ఓటర్ల జాబితాను పూర్తి చేయాలని బిఎల్ఎ ,బిఎల్ఓ లతో సమీక్ష నిర్వహించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హులైన ప్రతి ఓటరికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలని వారు సూచించారు. కార్యక్రమంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటరు వివరాలను నమోదు చేసుకోవడం లేదా సవరించుకోవడానికి అవసరమైన సహకారం అందించాలని ఆదేశించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు బాధ్యతాయుతంగా, నిబద్ధతతో పనిచేయాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు శ్రీనివాస్ గౌడ్, గ్రామ సర్పంచ్ అనిత శ్రీనివాస్, ఉప సర్పంచ్ గోపాల్, ,వార్డ్ మెంబెర్స్ రాజేందర్ నాయక్, రఘుమరెడ్డి, ప్రవీణ్, బాలరాజ్,కాంగ్రెస్ నాయకులు మాజీ సర్పంచ్ రమేష్ యాదవ్,భగవాన్ రెడ్డి డేవిడ్, నర్సింహా రెడ్డి జంగయ్య, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి హెల్పింగ్ హాండ్స్ చేయూత..


- రూ.5 వేల ఆర్థికసాయం



**రేవల్లి జూలై 27 (నినాదం):** వనపర్తి జిల్లా రేవల్లి మండల పరిధిలోని తల్పునూర్ గ్రామానికి చెందిన కోళ్ల బాలయ్య (39) కడుపునొప్పి భరించలేక శుక్రవారం తెల్లవారుజామున పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందించినప్పటికీ, పరిస్థితి విషమించ డంతో శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న గ్రామ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలోని హెల్పింగ్ హాండ్స్ గ్రూప్ సభ్యులు మృతుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారి కష్టసమయంలో అండగా నిలుస్తూ రూ.5,000 నగదు ఆర్థిక సాయాన్ని అందజేశారు. కుటుంబానికి ధైర్యం చెబుతూ, ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో సమాజం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు, హెల్పింగ్ హాండ్స్ గ్రూప్ సభ్యులు పాల్గొని మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. గ్రామంలో అవసరమైన వారికి భవిష్యత్తులోనూ హెల్పింగ్ హాండ్స్ ద్వారా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని సభ్యులు తెలిపారు.

## సిబ్బంది కొరతతో ఇబ్బంది

- సర్పంచ్ ఏల్పుల సరిత



**మహాదేవపూర్ జులై 27, (నినాదం);** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామపంచాయతీలో సిబ్బంది కొరతతో ఇబ్బందులు ఎదుర్కొం టున్నామని సర్పంచ్ ఎల్పుల సరిత మహాదేవపూర్ ఎంపీడీఓ రవీంద్రనాథ్ కు వినతిపత్రం అందజేశారు. గ్రామపంచా యతీలో సిబ్బంది కొరత కారణంగా గ్రామాభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆమె ఎంపీడీఓకు తెలిపారు. ఈసంద ర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామపం చాయతీలో తగిన సిబ్బంది లేకపోవడంతో రోజువారీ పనులను సమర్థవంతంగా నిర్వహించడం కష్టంగా మారిందన్నారు. వర్షాకాలం మొదలైన నేపథ్యంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు, చెత్త సేకరణ, సైడ్ కాలువల శు భ్రపరిచే పనులు చేపట్టడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతు న్నాయని తెలిపారు. అలాగే గ్రామపంచాయతీ ట్రాక్టర్‌కు డ్రైవర్ లేకపోవడంతో చెత్త తరలింపు, పారిశుద్ధ్య పనులు సకాలంలో నిర్వహించలేక పోతున్నామని ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లినట్లు ఆమె పేర్కొన్నారు. గ్రామ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అవసరమైన సిబ్బందిని, ట్రాక్టర్ డ్రైవర్‌ను వెంటనే నియమించి సమస్యను పరిష్కరిం చాలని ఎంపీడీఓకు అందించిన వినతిపత్రంలో కోరారు.

## పట్నం కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణా రావు, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు




**కుత్బుల్లాపూర్, జులై 27 (నినాదం):** శాస్త్రమండలి ప్రభుత్వ విప్ పట్నం మహేందర్ రెడ్డి కుటుంబాన్ని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు సోమవారం పట్నం మహేందర్ రెడ్డి కుటుంబం నివసిస్తున్న షాబాద్ లోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. పట్నం మహేందర్ రెడ్డి, పట్నం నరేందర్ రెడ్డిల తల్లి రుక్కమ్మ మృతి చెందిన నేపథ్యంలో షాబాద్ లోని వారి నివాసానికి వెళ్లి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారితో పాటు పట్నం అవినాష్‌రెడ్డి, కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రుక్కమ్మ పవిత్ర ఆత్మకు భగవంతుడు శాంతిని ప్రసాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ కోఆర్డినేటర్ సతీష్ అరోరా, కొలన్ ప్రభాకర్ రెడ్డి, పూడూరు మాజీ జెడ్పిటిసి సత్యనారాయణ రెడ్డి, నర్సింగ్ రావు, ధర్మారెడ్డి , జిన్నారం వెంకటేష్ గౌడ్, భాస్కర్ రెడ్డి, బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దళితుల జోలికొస్తే కఠిన చర్యలు తప్పవు

### గాలి వినోద్ కుమార్

బాధిత కుటుంబాలకు న్యాయం జరగకపోతే ఆమనగల్ లో జెన్ జీ పోరాటానికి సిద్ధం





**ఆమనగల్లు, జూలై (నినాదం):** ఆమనగల్లు పట్టణంలో దళిత కుటుంబాలపై అక్రమ కేసులు నమోదు చేయడం పట్ల రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్పీఐ) రాష్ట్ర అధ్యక్షులు గాలి వినోద్ కుమార్ తీవ్రస్థగ్రాన్ని వ్యక్తం చేశారు. సోమవారం ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి అంబేద్కర్ యువజన సంఘం ఉపాధ్యక్షులు వస్పుల సురేష్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ డాక్టర్"గాలి వినోద్ కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నవచైతన్య కాలనీలో ఎల్లమ్మ తల్లి ఆలయ భూమిని ఆక్రమించేందుకు కొంతమంది ప్రయత్నిస్తున్నారని, దీనిని అడ్డుకున్న 12 దళిత కుటుంబాలపై కౌలూరు కృష్ణదేవి అక్రమ కేసులు పెట్టించారని ఆరోపించారు. దళిత సమాజం ఆధిపత్యం చెరలో నిత్యం అణిచివేతకు గురవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు తక్షణమే న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఆమనగల్లు కేంద్రంలో పెద్ద ఎత్తున 'జెన్ జీ' తరహా పోరాటం నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు డివిజన్ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు జంతుక శంకర్, అంబేద్కర్ యువజన సంఘం ఉపాధ్యక్షులు వస్పుల సురేష్ అడ్వకేట్ జీవన్ కుమార్ ,డొక్కా పురుషోత్తం, హఫీజ్, రామచంద్రయ్యా,వస్పుల కృష్ణ,జంతుక శివ,మహేష్, యాదగిరి,శ్రీరామ్, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

## ఫస్ట్ ఎయిడ్ సెంటర్ లో అర్హతకు మించి వైద్యం చేయొద్దు..

### డిఎంహెచ్ఓ డాక్టర్ రవి రాథోడ్



**డోర్నకల్ /మరిపెడ జులై 27(నినాదం) :** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలో అర్హతలకు మించి వైద్య చికిత్సలు చేస్తున్న వెంకన్న ఫస్ట్ ఎయిడ్ సెంటర్ పై ఆకస్మిక తనిఖీలు చేసి సీజ్ చేసిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అర్హతలకు మించి ప్రజలకు వైద్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మంగళవారం । తెలంగాణ
28 జూలై 2026
నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం

# గంజాయిపై ఈగల్ ఫోర్స్ ఉక్కుపాదం

## ఏడాదిలో ఏడు టన్నుల గంజాయి స్వాధీనం: ఈగల్ ఫోర్స్ సూపరింటెండెంట్ గిరిధర్

**నిజామాబాద్ ప్రతినిధి, జులై 27 (నినాదం)** గంజాయి, డ్రగ్స్ విక్రయాలు, అక్రమ రవాణాను అరికట్టేందుకు రాష్ట్ర ఈగల్ ఫోర్స్ పక్కా ప్రణాళికలతో ముందుకు సాగుతోందని, హైదరాబాద్‌తో పాటు దేశవ్యాప్తంగా కొనసాగుతున్న గంజాయి సరఫరాలను విచ్ఛిన్నం చేయడానికి కేంద్ర దర్యాప్తు సంస్థలు, పొరుగు రాష్ట్రాల పోలీసులతో సమన్వయం చేసుకుంటూ సంయుక్త ఆపరేషన్లు నిర్వహిస్తోందని ఈగల్ ఫోర్స్ సూపరింటెండెంట్ గిరిధర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఏడాది కాలంలో ఈగల్ ఫోర్స్ వివిధ రాష్ట్రాల సరిహద్దుల్లో ప్రత్యేక దాడులు నిర్వహించి దాదాపు 7 టన్నుల గంజాయిని స్వాధీనం చేసుకుందన్నారు. అంతేకాకుండా గంజాయి అక్రమ రవాణాలో పాల్గొంటున్న ముఠాలపై నిఘా పెంచి కేంద్ర సంస్థలు, ఇతర రాష్ట్రాల చట్ట అమలు సంస్థలతో సమన్వయంగా భారీ సంయుక్త ఆపరేషన్లు నిర్వహిస్తూ సరఫరా నెట్‌వర్క్ ను ఛేదించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర సంస్థలతో కలిసి ఈగల్ ఫోర్స్ సంయుక్త ఆపరేషన్లు ఈగల్ ఫోర్స్ కేంద్ర దర్యాప్తు సంస్థలైన నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ తో పాటు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర రాష్ట్రాల పోలీసులతో సమన్వయంగా పలు కీలక సంయుక్త ఆపరేషన్లు నిర్వహించిందన్నారు. రాంచీ ఆపరేషన్ లో ఈగల్ ఫోర్స్, ఎన్‌సీబీ సంయుక్త ఆపరేషన్‌లో రాంచీలో 500 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారని, ఒడిశాలోని కోరాపుట్ సదర్ పోలీసులతో కలిసి నిర్వహించిన దాడిలో 500 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారన్నారు. రాయ్‌పూర్ సమీపంలోని ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతంలో నిర్వహించిన ఆపరేషన్‌లో 500 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోగా,



ఛత్తీస్‌గఢ్ మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో నిర్వహించిన సంయుక్త దాడిలో 500 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సరఫరా గొలుసు విచ్ఛిన్నమే ప్రధాన లక్ష్యమని గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలంటే కేవలం రవాణాదారులపై చర్యలు తీసుకోవడం మాత్రమే కాకుండా, మొత్తం సరఫరా గొలుసును విచ్ఛిన్నం చేయడం అవసరమని ఈగల్ ఫోర్స్ భావిస్తోందన్నారు. అందులో భాగంగా గంజాయి, డ్రగ్స్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా వాటిపై డిమాండ్‌ను తగ్గించి, అక్రమ సరఫరాకు అడ్డుకట్ట వేయాలనే లక్ష్యంతో చట్ట అమలు చర్యలతో పాటు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలను కూడా నిర్వహిస్తోందన్నారు. గంజాయి, డ్రగ్స్‌కు ఉన్న డిమాండ్‌ను తగ్గించడం ద్వారా అక్రమ సరఫరా గొలుసును పూర్తిగా తెంచివేయవచ్చని ఈగల్ ఫోర్స్ భావిస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్, ఒడిశా ప్రాంతాల నుంచి హైదరాబాద్ మీదుగా మహారాష్ట్ర, కర్ణాటక తదితర రాష్ట్రాలకు గంజాయిని తరలిస్తున్న వ్యవస్థీకృత ముఠాలపై ఈగల్ ఫోర్స్, ఇంటెలిజెన్స్ విభాగాలతో కలిసి నిరంతర నిఘా కొనసాగిస్తోందన్నారు. అంతర్‌రాష్ట్ర అక్రమ రవాణా నెట్‌వర్క్‌లను గుర్తించి, వాటిని ఛేదించేందుకు ప్రత్యేక వ్యూహాలతో సంయుక్త ఆపరేషన్లు నిర్వహిస్తోందన్నారు. అంతర్‌రాష్ట్ర గంజాయి అక్రమ రవాణా ముఠాలపై వరుసగా విజయవంతమైన దాడులు నిర్వహించి, భారీ మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు అక్రమ సరఫరా నెట్‌వర్క్‌లను ఛేదించినందుకు ఈగల్ ఫోర్స్ దేశవ్యాప్తంగా విశేష గుర్తింపు పొందిందన్నారు.

**. . . నిజామాబాద్ యాంటీ నార్కోటిక్స్ విభాగం విజయాలు**

సమాజంలో మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణా విక్రయాలను పూర్తిగా అరికట్టే లక్ష్యంతో నిజామాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని యాంటీ నార్కోటిక్స్ విభాగం, ఎన్‌డీపీఎస్ చట్టం -- 1985 ప్రకారం పలు కేసులు నమోదు చేసి నిందితులను అరెస్టు చేయడంతో పాటు ఆల్ప్రాజోలమ్ మాత్రలు, గంజాయి, ఇతర సంబంధిత సొత్తును స్వాధీనం చేసుకుందన్నారు. మత్తు పదార్థాల సరఫరా గొలుసును పూర్తిగా నిర్మూలించేందుకు ప్రత్యేక నిఘా, ఇంటెలిజెన్స్ ఆధారిత దాడులు, అవగాహన కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తోందన్నారు. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు పోలీస్ స్టేషన్ లో 864 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోగా, అంచనా విలువ రూ. 4,32,00,000 ఉంటుందన్నారు. నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్ 2.500 కిలోల ఆల్ప్రాజోలమ్ స్వాధీనం చేసుకోగా దాని విలువ రూ. 27, 50,000 కాగా, వనపర్తి జిల్లాలో పెబ్బేర్ పోలీస్ స్టేషన్ లో 500 గ్రాముల ఆల్ప్రాజోలం, నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ 600 గ్రాముల ఆల్ప్రాజోలమ్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నగరంలోని 4వ పోలీస్ స్టేషన్ పరిధిలో 157.23 గ్రాముల ఆల్ప్రాజోలమ్ స్వాధీనం చేసుకోగా, ముప్కాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 610 గ్రాముల ఆల్ప్రాజోలమ్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 156 గ్రాముల ఆల్ప్రాజోలమ్, ఆర్మూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 500 గ్రాముల ఆల్ప్రాజోలమ్, నందిపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో 167.5 గ్రాముల ఆల్ప్రాజోలమ్, కామారెడ్డి జిల్లా జుక్కల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 21 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆల్ప్రాజోలమ్ సుమారు 5.206 కిలోలు స్వాధీనం చేసుకోగా దాదాపు దాని ధర రూ. 52,06,000గా ఉంటుందన్నారు. ఆల్ప్రాజోలమ్ , గంజాయి ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, నిల్వ, విక్రయాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు కొనసాగుతాయని పోలీసులు స్పష్టం చేశారు. 2014 నుండి 2026 వరకు చేపట్టిన నిరంతర చర్యల ఫలితంగా రాష్ట్రంలో గంజాయి వినియోగం తగ్గుముఖం పట్టిందన్నారు. 2024లో నమోదైన 8 కమర్షియల్ క్వాంటిటీ కేసులు, 2025లో 2 కేసులకు తగ్గడం ఈ చర్యల ప్రభావాన్ని సూచిస్తోందన్నారు. 2025,2026 సంవత్సరాలలో 165 మంది డ్రగ్స్/గంజాయి వినియోగదారులను గుర్తించి సంబంధిత పోలీస్ స్టేషన్లకు అప్పగించామన్నారు. 2024-26 వరకు మొత్తం 492 అవగాహన కార్యక్రమాలు నిర్వహించా మన్నారు. వాటిలో 192 కార్యక్రమాలు కల్తీ కల్లు, మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై ప్రత్యేకంగా నిర్వహించబడ్డాయని తెలిపారు. మత్తు పదార్థాల నేరాలకు పాల్పడుతున్న మునావర్ అలీ, షేక్ అలీమా, గంధం శ్రీనివాస్ గౌడ్, మల్లెపూల లక్ష్మణ్ గౌడ్ పీడీ యాక్టు చట్టం కింద నిర్బంధ చర్యలు చేపట్టే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. మత్తు పదార్థాల నేరాలకు పాల్పడే వారిపై ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకొని కోర్టు ద్వారా జైలుకు పంపించడం జరుగుతుందన్నారు. ప్రతి పౌరుడు యాంటీ డ్రగ్ సోల్జర్ గా బాధ్యతతో వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. డ్రగ్స్ విక్రయం, కొనుగోలు, రవాణా, గంజాయి సాగు, నిల్వ లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే నిర్భయంగా పోలీసులకు తెలియజేయాలన్నారు. సమాచారం అందించేందుకు యాంటీ డ్రగ్ టోల్ ఫ్రీ నంబర్ 1908, వాట్సాప్ నంబర్: 8712671111కు ఇవ్వాలని, సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయన్నారు. గంజాయి వద్దు ప్రాణం ముద్దు" అనే సందేశాన్ని ప్రతి యువకుడు, ప్రతి కుటుంబం ఆచరణలో పెట్టాలని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన, బాధ్యతాయుతమైన జీవితాన్ని గడపడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో నార్కోటిక్ ఏసీపీ సోమనాథం, సీఐ పూర్ణేశ్వర్ పాల్గొన్నారు.

### అయిజలో కలాంకు
# ఘన నివాళులు



**గద్వాల ప్రతినిధి జూలై 27 (నినాదం):** జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మున్సిపాలిటీ కేంద్రంలోని జెడ్పీ హెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో మాజీ రాష్ట్రపతి, భారత రత్న డా. ఏపీజే అబ్దుల్ కలాం 11వ వర్ధంతి సందర్భంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు ఆంజనేయులు ఆధ్వర్యంలో కలాం విగ్రహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పాఠశాల సీనియర్ ఉపాధ్యాయుడు శర్మ మాట్లాడుతూ డా. అబ్దుల్ కలాం ఉపాధ్యాయుడిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించి శాస్త్రవేత్తగా ఎదిగి భారతదేశానికి విశిష్ట సేవలు అందించారని తెలిపారు. రాకెట్ సాంకేతిక రంగంలో ఆయన చేసిన కృషి వల్ల భారతదేశానికి ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు లభించిందన్నారు. కలాం ఆశయాలను కొనసాగిస్తూ యువత ఉన్నత విద్యను అభ్యసించి దేశాభివృద్ధికి తమ వంతు సేవలు అందించాలని, దేశానికి, సమాజానికి గర్వకారణంగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు మాల మల్లికార్జున్, టీఆర్ఎస్ నాయకుడు అశ్వ పెద్దయ్య, గోరంట్ల స్వామిదాసు, క్రిస్టఫర్, మాజీ కౌన్సిలర్ మౌల, కనికీడు భాష, తూముకుంట కిష్టన్న, పాఠశాల ఉపాధ్యాయ బృందం, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నీస సౌకర్యాలకు నోచుకోని ప్రభుత్వ ఆసుపత్రి.

## ప్రభుత్వ వైద్యం ప్రజలకు అందని ద్రాక్షనే...- మెరుగైన వైద్యం కోసం సిపిఎం జిల్లా కలెక్టరేట్ ధర్నా.





**నారాయణపేట ప్రతినిధి, జులై 27, (నినాదం):** ప్రజలకు మెరుగైన వైద్యం అందుకోవడం అగమ్యగోచరంగా మారిందని నారాయణపేట జిల్లాలో ప్రభుత్వాసుపత్రి లో కనీస సౌకర్యాలు కొరవడ్డాయని సిపిఎం జిల్లా కార్యదర్శి జి. వెంకట్రాంరెడ్డి విమర్శించారు. సోమవారం నాడు నారాయణపేట జిల్లా కేంద్రంలోని మునిసిపల్ పార్కు దగ్గర ఆ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో ఆయన ప్రసంగిస్తూ నారాయణపేట జిల్లా కేంద్రంలో జిల్లా ఆసుపత్రి, జిల్లా మెడికల్ కాలేజీ లో 97 మంది డాక్టర్లతో నడవాల్సి ఉండగా కేవలం 30 మంది వైద్యులతో మాత్రమే నడుస్తున్నదని అన్నారు. దీనివలన రోజువారిగా వస్తున్న ఓపి పేషెంట్స్ ఎనిమిది వందల నుండి 1100 మందికి ఓపి పేషెంట్స్ కు వైద్య విద్యార్థులకు ఇబ్బందిగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే వైద్య డాక్టర్లకు ప్రత్యేక ఇన్సెంటివ్ అందించాలని అలా అందిస్తేనే మారుమూల ప్రాంతమైన నారాయణపేటలో డాక్టర్లు పనిచేయడానికి ముందుకు వస్తారని తెలిపారు.

జిల్లా మెడికల్ కాలేజీకి సొంత భవనం లేక జిల్లా ఆస్పత్రి భవనాలలోనే నడుస్తున్నదని మెడికల్ కాలేజీకి సొంత భవనాన్ని వెంటనే నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, రెసిడెంట్ డాక్టర్లు తదితర వైద్య సిబ్బందిని పూర్తిస్థాయిలో ప్రభుత్వం కేటాయించి మారుమూల ప్రాంతంలో నారాయణపేట జిల్లా ప్రజలను మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం సహకరించాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోపాల్, బి. బలరాం పుంజనం ఆంజనేయులు మాట్లాడుతూ.. మద్దూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రముకు పెద్ద భవనం ఉన్నప్పటికీ వైద్య సిబ్బంది లేరని రోజుకు 500 మంది హాస్పిటల్ కు రోగులు వస్తున్నారని వారికి సరైన వైద్యం అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

కొత్తపల్లి ప్రాథమిక పల్లె దావకానలో డాక్టర్ లేదని ఫార్మాసిస్టు పోస్టు ఖాళీ ఉందని కేవలం ఆశ వర్కర్ తో నడిపిస్తున్న వైనం కానవస్తుందని అన్నారు. ఇది సీఎం నియోజకవర్గంలో ఉండడం శోచనీయ మన్నారు. కోటకొండ మరికల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మంచినీటి సౌకర్యం లేదని సరిపడ గదులు లేవని మీటింగ్ హాలు స్టాఫ్ కు వెయిటింగ్ హాల్ లేవని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు నిధులు మూడు సంవత్సరాల నుండి రాక కనీస అవసరాలు తీర్చుకోలేని పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ధన్వాడ మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శిథిలావస్థలో ఉన్నదని వెంటనే నూతన భవనాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. సబ్ సెంటర్ కి 25 లక్షల నూతన భవనాన్ని నిర్మించిన ప్పటికీ ఏడాదిన్నర కావస్తున్న ప్రారంభానికి నోచుకోకుండా దిష్టిబొమ్మల ఉంచారన్నారు. కోస్గి మక్తల్ సర్జన్ ఫార్మసిస్ట్ పోస్టులు ఖాళీగా ఉన్నా యన్నారు. మక్తల్ లో ఏరియా హాస్పిటల్ భవనం శిథిలావస్థలో ఉన్నదని ఎప్పుడు కూలా తుందో తెలియని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. నూతన భవనాన్ని వెంటనే పూర్తి చేసి ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

నారాయణపేట జిల్లా కేంద్రంలో 40 వేల జనాభా ఉన్న ప్రాంతానికి ప్రభుత్వ ఆసుపత్రి లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వంద పడకలతో నూతన ఏరియా హాస్పిటల్ నిర్మించి వైద్య సేవలు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ ప్రి యాంకకు అందజేశారు. కలెక్టర్ సిపిఎం బృందంతో మాట్లా డుతూ హాస్పటల్లా సమస్యలపై చర్చిస్తున్నామని పరిష్కారం కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపుతామని సరిపడ డాక్టర్లును కేటా యించుటకు కృషి చేస్తున్నామని తెలిపారని వారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు గోవింద్ రాజ్ ,జోషి కె కాశప్ప, నరహరి, అరుణ్, దేవప్ప కన్వీనర్ సోఫీ మజార్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# నగలపై కన్నేసి నడి చెరువు పొదల్లో ప్రాణం తీశారు

## అయిదారేళ్ల అక్రమ సంబంధమే ఉసురు తీసింది: జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్






**నారాయణపేట ప్రతినిధి, జులై 27, (నినాదం ):** శాంతమ్మది శాంత స్వభావం ఓ వ్యక్తిని నమ్మి (అక్రమంగా) వరించింది. వారి సహజీవనం ఆరేళ్లుగా కొనసాగుతూ వచ్చింది తను నమ్ముకున్న జోగురాజు కన్ను తన నగలపై పడ్డ విషయాన్ని గమనించని శాంతమ్మ రాజు రమ్మన్న చోటుకు ముస్తాబై నగలు ధరించి తన వెంట వెళ్ళిపోయింది. తనకు తెలియదు తన నగలే తనకు శాపంగా మారుతాయని. మద్దూరు మండలం నుండి బైక్ పై ఎక్కించుకొని నారాయణపేట మండలం జాజాపూర్ చెరువు ప్రాంతానికి తీసుకెళ్లిన రాజు, భాస్కర్లు అక్కడ ఫుల్లుగా మద్యం సేవించి రాత్రంతా గడిపారు. అనంతరం నగలు దొంగిలించారు. తెల్లవారుజామున మెలకువ రాగా విషయం ఎక్కడ బయటకు పోక్కుతుందోనని భయపడ్డా ఇద్దరు వ్యక్తులు స్కార్పుతో మెడకు ఉరి బిగించి చెరువు పొదల్లో హత్య చేశారు. పూర్తి వివరాలు పోలీసుల కథనం లోకి వెళితే... మద్దూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జాదవరావుపల్లి గ్రామానికి చెందిన గౌయికల శాంతమ్మ (45) అదృశ్యమైనట్లు ఆమె కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నెల 15 న మద్దూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నాడు పత్రికా సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడిస్తూ...దర్యాప్తులో భాగంగా మృతురాలి వద్ద ఉన్న బంగారు నగలను దోచుకోవాలనే ఉద్దేశంతో జోగు రాజు (A-1), బడుగుల భాస్కర్ (A-2) ముందుగానే పథకం రచించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో ఈ నెల 12 న శాంతమ్మ ను ఫోన్ ద్వారా మద్దూర్‌కు రప్పించి, మోటార్ సైకిల్‌పై జాజాపూర్ చెరువు సమీపంలోని చెట్ల పొదల్లోకి తీసుకెళ్లి, మద్యం సేవిం చిన అనంతరం ఆమెతో శారీరకంగా కలిసి, చున్నీతో గొంతు బిగించి హత్య చేసినట్లు విచారణలో వెల్లడైందని తెలిపారు. హత్య అనంతరం మృతురాలి వద్ద ఉన్న బంగారు, వెండి ఆభరణాలు, సెల్‌ఫోన్, పర్సు, ఆధార్ కార్డు ను తీసుకుని, ఆధారాలను నాశనం చేసే ఉద్దేశంతో వాటిని బోరు కేసింగ్‌లో పడవేశారని తెలిపారు. అనంతరం బంగారు నగలను నారాయణపేటలో విక్రయించి వచ్చిన నగదును ఇద్దరూ పంచుకున్నట్లు నిందితులు ఒప్పుకున్నారని ఎస్పీ తెలిపారు. నిందితుల వద్ద నుంచి ఒక తులం బంగారు ఆభరణాలు (కమ్మలు, మ్యాట్నీలు, పుస్తెల గుండ్లు), 50 తులాల వెండి ఆభరణాలు (కడియాలు, పట్టీలు), రూ. 50వేల నగదు, నేరానికి ఉపయోగించిన రెండు మోటార్ సైకిళ్లు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే దొంగిలించిన బంగారు నగలను కొనుగోలు చేసిన జాజాపూర్ గ్రామానికి చెందిన కృష్ణ (A-3) ను కూడా అరెస్ట్ చేసి, ముగ్గురు నిందితులను న్యాయస్థా నంలో హాజరుపర్చి రిమాండ్‌కు తరలిం చినట్లు తెలిపారు.

**ప్రజలకు, వ్యాపారులకు ఎస్పీ హెచ్చరికలు, సూచనలు**

మహిళలు ఎంతటి పరిచయస్తులైనా సరే ఇంటి సభ్యులకు చెప్పకుండా నిర్మాణుష్య ప్రాంతాలకు, లేదా దూరప్రాంతాలకు వెళ్ళకూడదు అని సూచించారు. బయటకు వెళ్లే సమయంలో ఇంట్లో కచ్చితంగా సమాచారం ఇవ్వవ లసిందిగా కోరారు. అదేవిధంగా ప్రజలు ఎవరైనా సరే బంగా రు, వెండి, ఇతరత్రా వస్తువులను స్వర్ణకారులు, షాపుల యజమానులు అనుమానితుల నుండి కొనుగోలు చేయరాదని స్పష్టం చేశారు. ఒకవేళ అలా కొనుగోలు చేస్తే నేరంలో భాగస్వాము లుగా భావించి చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిం చారు. ఈ కేసును డీఎస్పీ ఎన్. లింగయ్య పర్యవేక్షణలో అత్యంత సమర్థవంతంగా ఛేదించిన కోస్గి సీఐ సైదులు, మద్దూర్ ఎస్ఐ బి. శ్రీనివాసులు, ఏఎస్ఐ బాలయ్య, హెడ్ కానిస్టేబుళ్లు పెంటయ్య, గోపాల్, బి. రాజు, పోలీసు కానిస్టే బుళ్లు పుల్యా నాయక్, నాగమల్లయ్య, పరందాములు, సీసీఎస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టాలి

### జిల్లా వ్యాప్తంగా 13 మండలాల రైతు వేదికల్లో ఘనంగా ప్రారంభమైన విత్తన మేళా కార్యక్రమాలు
### ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన విత్తనాలు,పథకాలతో లాభదాయక వ్యవసాయం సాధించాలి
### వ్యవసాయంతో పాటు ఉద్యాన సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలి: గద్వాల్ శాసన సభ్యులు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి






**గద్వాల బ్యూరో జులై 27 (నినాదం ):** వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని గద్వాల్ శాసన సభ్యులు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం ధరూరు రైతు వేదికలో నిర్వహించిన విత్తన మేళా కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం విత్తన ప్రదర్శన స్టాళ్లను సందర్శించి రైతులకు మొక్కజొన్న విత్తనాలను పంపిణీ చేశారు. రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ,రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా జిల్లాలోని 13 మండలాల రైతు వేదికల్లో విత్తన మేళా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు.రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు మారుతున్న నేపథ్యంలో రైతులు సంప్రదాయ సాగు విధానాలకు బదులుగా పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం వర్షపాతం ఆశించిన స్థాయిలో లేకపోవడం, ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు తగ్గిపోవడంతో సాగునీటి లభ్యత పరిమితంగా ఉండే అవకాశం ఉందన్నారు. అందువల్ల అధిక నీటి అవసరమున్న వరి సాగును వీలైనంత మేర తగ్గించి,తక్కువ నీటితో సాగు చేయగల ఆరుతడి పంట లను సాగు చేయాలని రైతులకు సూచించారు. వరికి బదులుగా కంది, పెసర,మినుము, శనగ, జొన్న,సజ్జ, మొక్కజొన్న, వేరుశెనగ,నువ్వులు,వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. ఈ పంటల సాగు ద్వారా తక్కువ పెట్టుబడితో మెరుగైన దిగుబడులు, గిట్టుబాటు ధరలు లభించి రైతులు అధిక ఆదాయం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే రైతులు పండ్ల తోటలు, కూరగాయలు, ఇతర ఉద్యాన పంటల సాగుకు ప్రాధాన్యత ఇస్తే అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. ప్రభుత్వం ఉద్యాన పంటలకు అందిస్తున్న సబ్సిడీలు, ప్రోత్సాహక పథకాలను సద్వినియోగం చేసుకుని సాగు విస్తీర్ణాన్ని పెంచి లాభదాయక వ్యవసాయం వైపు అడుగులు వేయాలని రైతులకు సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తూ శాస్త్రీయ సాగు విధానాలను అవలంబించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన విత్తనాలు,సాంకేతిక సేవలు, పథకాలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ఉపాధి హామీ పనులను విస్తృతంగా చేపట్టాలన్నారు. పశువులకు తాగునీరు, మేత కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నీటి వనరులను పొదుపుగా వినియోగించడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. చెరువులు, కుంటలు, కాలువలను సంరక్షించి వర్షపు నీటిని నిల్వ చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో విస్తృతంగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా వ్యవసాయ అధికారి వీరప్ప మాట్లాడుతూ,వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు దీర్ఘకాలిక రకాల కంటే స్వల్పకాలిక, ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని, వ్యవసాయ శాఖ సాంకేతిక సూచనలను పాటించాలని సూచించారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రాజ్ కుమార్ మాట్లాడుతూ,పండ్ల తోటలు, కూరగా యలు, ఇతర ఉద్యాన పంటల సాగు ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని,ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, ప్రోత్సాహక పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో గద్వాల్ మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంతు,ధరూరు సర్పంచ్ డి. ఆర్ విజయ్,ఏడీఏ, ఎంఏఓలు,ఏఈఓలు,ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.


# ప్రజల దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి...

## స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ

**ఖమ్మం, జూలై- 27(నినాదం ):** ప్రజలు తమ సమస్యలు తెలుపుతూ సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రజల అర్జీలను స్వీకరిం చారు. -రఘునాథపాలెం మండలం వి. వెంకటాయపాలెం గ్రామానికి చెందిన కే. సక్కుబాయమ్మ గ్రామ సర్వే నెంబర్ 257/ఏఏ లో ఉన్న 5 ఎకరాల 26 గంటలకు జారీ చేసిన నాలా అనుమతిని రద్దుచేసి ఈ పాస్ పట్టాదార్ పాస్ పుస్తకం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. -ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెం గ్రామ పాలకవర్గ సభ్యులు తమ గ్రామంలో రోడ్డు విస్తరణలో తొలగిస్తున్న అంబేద్కర్ విగ్రహం గ్రామపంచాయతీ కార్యాలయం ప్రక్కన ఉన్న ప్రభుత్వ స్థలంలో సురక్షితంగా మార్చడానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఎంపీడీవో ఖమ్మం రూరల్ మండలానికి తగు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. - పి. డి. ఎస్. యూ. ఖమ్మం జిల్లా కమిటీ సభ్యులు జిల్లా వ్యాప్తంగా ఉన్న సంక్షేమ హాస్టల్ల సమస్యలను పరిష్కరించాలని, విద్యార్థులకు పరుపులు, బెడ్లు అందించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా సంబంధిత అధికారులకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ సీహెచ్. రామ్మూర్తి , జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# కొత్త రాజోలిలో ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు వినతి



**గద్వాల ప్రతినిధి జులై 27 (నినాదం):** జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం రాజోలి మండలంలోని కొత్త రాజోలి గ్రామంలో ఎంఆర్ఓతో పాటు ఇతర ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని కోరుతూ కొత్త రాజోలి అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఎంఆర్ఓ రామ్మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. 2009 వరదలతో పాత రాజోలి గ్రామం ముంపునకు గురికావడంతో ప్రభుత్వం కొత్త రాజోలిని ఏర్పాటు చేసి, ఇళ్ల స్థలాలు, పాఠశాలలు, ఆసుపత్రి తదితర అవసరాల కోసం ప్రభుత్వ భూమిని కేటాయించిన విషయాన్ని వినతిలో గుర్తు చేశారు. ప్రస్తుతం ఎంఆర్ఓ కార్యాలయ నిర్మాణానికి రూ. 2.25 కోట్లు మంజూరైన నేపథ్యంలో, కొత్త రాజోలిలోని రెండు ఎకరాల ప్రభుత్వ భూమిలోనే కార్యాలయాలను నిర్మించాలని కోరారు. కొత్త రాజోలి వరద ముంపు లేని ఎత్తైన ప్రాంతమని, రికార్డుల భద్రతతో పాటు 11 గ్రామాల ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని వివరించారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఎంఆర్ఓ రామ్మోహన్ సమస్యను పరిశీలించి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అఖిలపక్ష కమిటీ సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.